క్లుప్తంగా

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఎంపీ వంగా గీత

పిఠాపురం: విజయవాడ నడి బొడ్డున రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించిన స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోయే 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సామాజిక సమతా సంకల్ప సభకు ప్రజలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. పిఠాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు తమ బాధ్యతగా భావించి అధిక సంఖ్యలో జనం తరలివచ్చేలా చూడాలని కోరారు.

షర్మిలారెడ్డికి దవులూరి సత్కారం



షర్మిలారెడ్డిని సత్కరించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: నూతన హౌసింగ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మేడపాటి షర్మిలారెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు సత్కరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి షర్మిలారెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో ఆమె బుధవారం విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దాంతో ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

21న విశ్రాంత రైల్వే ఉద్యోగుల సమావేశం

సామర్లకోట: విశ్రాంత రైల్వే ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి ఈనెల 21వ తేదీన రైల్వే పెన్షనర్ల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్ల సంక్షేమ ఫెడరేషన్ కార్యదర్శి, విశ్రాంత రైల్వే మేనేజరు ఎల్‌ఎస్ రాజ్‌పుట్ బుధవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రైల్వే స్టేషన్ ఆవరణలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏటా జరిగే సమావేశంలో రైల్వే పెన్షనర్లు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ పెన్షనర్లను సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు.

పేదలు, వృద్ధులకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న సత్యనారాయణ, అప్పారావు కుటుంబ సభ్యులు

సామర్లకోట: స్థానిక సంగీతరావుపేట, అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద బుధవారం పేదలు, వృద్ధులకు వస్త్రదానం చేశారు. వేల్పుల పద్మరాజు, నాగన్నల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సంగీతరావుపేట, బలుసులపేట, వీర్రాఘవపురం ప్రాంతాలకు చెందిన 100 మంది పేదలను గుర్తించి వస్త్రదానం చేశారు. ఏడేళ్లుగా ఏటా ముక్కనుమ రోజున వస్త్రదానం నిర్వహిస్తున్నట్లు వేల్పుల సత్యనారాయణ, నూకరత్నం, అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ రామోహన రావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పిఠాపురం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు సామర్లకోట రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న వ్యక్తి వంటిపై లేత నీలి రంగు చొక్కా, ముదురు నీలి రంగు ఫ్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి కుడి చేతిపై కన్నమ్మ అనే పచ్చ బొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టుఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పిఠాపురం రైల్వే అధికారులకు, సామర్లకోట పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై స్వామి నాయుడు అన్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో బుధవారం యువతకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదంలో అధిక శాతం యువకులే ప్రమాదాలకు గురవుతన్నారని, లైసెన్సు, రికార్డులు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని, అతి వేగం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. అంతేకాకుండా మద్యం సేవించి వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం

- 20 నుంచి మూడు రోజులు గంధోత్సవాలు
- మత సామరస్యానికి ప్రతీకగా ఉరుస్

పెద్దాపురం: సుమారు 354 సంవత్సరాల చరిత్ర కల్గిన పట్టణ శివారులోని హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా (తొమ్మిది మూరల సాయిబు) మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుస్ ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించేందుకు దర్గా కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా 20వ తేదీన దర్గా వద్దకు మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు విచ్చేసి బాబా ఆశీస్సులు పొందుతారు. ముస్లిం పెద్దలు, అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ ఇంటి వద్ద నుంచి 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు గంధం ఊరేగింపు మేళతాళాలతో బయలుదేరి దర్గా వద్దకు చేరుకుంటుంది. సాయంత్రం ఏడు గంటలకు హైదరాబాద్ వారిచే తయారు చేయబడిన పచ్చటి వస్త్రాన్ని బాబా దర్గాకు అలంకరించి ఖురాన్ పఠనంతో గంధాన్ని బాబా సమాధికి పూస్తారు. ఆ గంధాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో స్వీకరిస్తారు.

దాతల సహకారంతో..

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉర్సును ఏటా ప్రజా సహకారంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. దర్గాకు సంబంధించి ఎటువంటి ఆస్తులు లేకపోవడంతో దాతలు పై కప్పు ఏర్పాటు, దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి సహకారాలందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితరులు ప్రారంభిస్తారు. 22వ తేదీ వరకు గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మూడో రోజు భారీ విందు ఏర్పాటు చేస్తారు. దర్గా సభ్యులు ఎండీ లాయక్ ఆలీ, బాబూలాల్, ఆషిక్ ఆలీ, రఫీ, షబ్బీర్, జలీల్, బాజి, రిజ్వాన్, ఇర్షాద్ ఆలీ, హఫీజ్, జాకిర్‌ల ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మూడు రోజుల పాటు భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా అన్ని మతాల వారితో కలిపి వివిధ సేవా కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం నిర్వహించి ఉరుస్‌ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 20వ తేదీ రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం వారిచే మిమిక్రీ ట్రాక్, మ్యూజికల్ ప్రోగ్రామ్‌తో పాటు ఖవ్వాలీని ఘనంగా నిర్వంచేందుకు ఏర్పాట్లు చేశారు.



ఉరుస్ గంధోత్సవానికి సిద్ధమవుతున్న తొమ్మిది మూరల సాయిబు సమాధి

నెలగంట ముగ్గులకు వీడ్కోలు



సామర్లకోటలో రథం ముగ్గులతో ధనుర్మాసానికి వీడ్కోలు

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకుని నెల గంటతో నెల రోజుల పాటు సాగిన ఇంటింట ముగ్గులకు ముక్కనుమ రోజున వీడ్కోలు పలికారు. బుధవారం తెల్లవారు జామున మహిళలు వారి వారి ఇళ్ల ముందు రథం ముగ్గులను వేసి, ఆ రథాన్ని తాళ్లతో లాగుతున్నట్లుగా ముగ్గువేసి తాడును సమీపంలో ఉన్న భోగి మంటలకు కలిపారు.

సమస్యలపై సభ్యుల మండిపాటు



సమావేశంలో ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ రాజా

- ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల తీరుపై ఆగ్రహం
- వాడీవేడిగా పెద్దాపురం మండల సమావేశం

పెద్దాపురం: మర్లావలో సారా నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ పూర్తిస్థాయిలో విఫలమైందని వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. అలాగే మండల సమావేశానికి మండల స్థాయి అధికారులను పంపడం తగదని ఆయన పేర్కొన్నారు. మండల పరిషత్ బడ్జెట్ సమావేశం బుధవారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఆరు నెలల నుంచి కాకినాడ–తామరాడ బస్సు సర్వీస్ పునరుద్ధరిస్తామని అధికారులు కాలయాపన చేయడంపై రాజా, మండల సభ్యులు మండిపడ్డారు. ఈ సందర్భంగా కాండ్రకోట ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, చదలాడ గ్రామ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు మాట్లాడుతూ ఏటిపట్టు గ్రామాల ప్రజలకు ఆరోగ్యరీత్యా కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లాలంటే ఇదే ప్రధాన సర్వీస్ అన్నారు. జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ సత్యవతి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్, ఎంపీటీసీలు పని చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి చేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో మరింత అభివృద్ధి చెందాలనే సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం అధికారులు సంబంధిత శాఖల ప్రగతిని వివరించారు. ఎంపీడీఓ బి.అశోక్ కుమార్, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, ఎంఈఓలు శర్మ, చౌదరి, వ్యవసాయ శాఖ ఏఓ సంజయ్ కుమార్, పులిమేరు పీహెచ్‌సీ వైద్యులు శ్రావణితో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. తొలుత బడ్జెట్‌ను ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ చదివి వినిపించగా రూ.77,500 రూపాయల మండల మిగులు బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



మల్లాంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: పండుగ సందర్భంగా అందరూ సొంత గ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకుంటే.. పాత విద్యార్థులు తమ పాత స్నేహితులతో కలిసి పండుగ జరుపుకొన్నారు. పండుగ నాడు గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పిఠాపురం మండలం మల్లాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ముక్కనుమ పండగ రోజు కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో తమ తీపి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకున్నారు. అప్పట్లో వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కావమ్మ తిరునాళ్లు



కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్న భక్తులు



కావమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గేమ్స్‌లో పిల్లల సందడి

సామర్లకోట: స్థానిక రజకపేటలో ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న కావమ్మ ఆలయం వద్ద సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లు బుధవారంతో ముగిసాయి. మండల పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయకూలీల కుటుంబాల వారు కావమ్మ, మార్యెయ్యలను దర్శించుకున్నారు. పాఠశాలలకు 18 వరకు సెలవులు ఉండడంతో తిరునాళ్లకు అధిక సంఖ్యలో పిల్లలు తరలి వచ్చారు. ఆలయం సమీపం నుంచి వెళ్తున్న పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో ఎయిర్ బాల్ ఏర్పాటు చేసి పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేశారు. 22వ తేది సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు సుకపట్ల నాగేశ్వరరావు, ఆదినారాయణ తెలిపారు.

కనువిందు



ఒకే అరిటాకులో భోజనం చేస్తున్న కుటుంబం

పిఠాపురం: పండగంటేనే కుటుంబ సమేతంగా కలిసి మెలిసి సంతోషంగా గడిపేది. ముఖ్యంగా సంక్రాంతికి ఎక్కడెక్కడో స్థిర పడిన వాళ్లందరూ తమ సొంత ఊళ్లకు వస్తారు. కుటుంబ సభ్యులతో కలుసుంటారు. ఇలా పిఠాపురానికి చెందిన సియాదుల సోమేశ్వర రావు తన అల్లుళ్లను పండగకు ఆహ్వానించారు. వారికి మర్యాద చేయడంలో కొత్త దనాన్ని చూపించారు. తన ముగ్గురు అల్లుళ్లకు కూతుళ్లతో కలిసి ఒకే అరిటాకులో 18 రకాల పిండి వంటలతో ఒకేసారి భోజనం ఏర్పాటు చేశారు. ఈ దృశ్యం చూసేందుకు కనువిందుగా ఉంది.

జి.కొత్తపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

శంఖవరం: జి.కొత్తపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర బుధవారం నిర్వహించారు. ఈ యాత్రను స్థానిక సర్పంచ్ ఈగల విజయదుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు అమలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, నోడల్ అధికారి రామకృష్ణ, ఎంఈఓ ఎస్‌వీ రమణ,ఏపీఓ రాజగోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బస్సు దగ్ధం



దగ్ధమైన టూరిస్టు బస్సు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం జాతీయ రహదారిపై జోడుగెడ్ల వంతెన సమీపంలో ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు ధర్మవరానికి వచ్చేసరికి ఈ ప్రమాదానికి గురైంది. ఇందులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. శబ్దాలు రావడంతో అందరినీ కిందకు దించేయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతికేళ్లు దాటినా అదే సందడి..



లూథరన్ హైస్కూల్ 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు

పెద్దాపురం: పట్టణం లూథరన్ హైస్కూల్‌లో 1995–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కలయికలో వారంతా ఒక చోట చేరారు. వివిధ హోదాల్లో పనిచేసి జీవితంలో తమకంటూ ఓ గుర్తింపును దక్కించుకున్న వారందరూ నాటి రోజుల్లోకి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం సరదా కబుర్లు నాటి నిక్ నేమ్‌లతో పిలుచుకుంటూ ఆనాటి అల్లర్లలో గడిపేశారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకుని ఆనాటి స్నేహ గీతికలను పాడుకున్నారు.

వైభవంగా త్రిమూర్తుల తీర్థం



త్రిమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకుడు

తుని రూరల్: చేపూరులో 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న త్రిమూర్తుల స్వామి ఆలయం వద్ద బుధవారం తీర్థం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు త్రిమూర్తుల స్వామిని దర్శించి, పూజలు చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ప్రమాదాలు నివారణకు హైవే అధికారులు, రూరల్ పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. గ్రామస్తులతో పాటు రాజుపేట, మర్లపాడు, వెలమ కొత్తూరు, కొత్త వెలంపేట, ఎర్రకోనేరు, జగన్నాథగిరి, గెడ్లబీడు, తుని తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి, తీర్థంలో పాల్గొన్నారు.

నేడు : తుని మండలం జగన్నాథగిరి శివారు మెట్టపై గురువారం బాలయోగి తీర్థం నిర్వహించనున్నారు. ముక్కనుమ మరుసటి రోజు ఇక్కడ తీర్థం నిర్వహించనుండగా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ..



కొండెవరంలో కలసిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2015–2016 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. గత తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని, సహపంక్తి భోజనాలుచేసి సంతోషంగా గడిపారు.అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు.

సెబ్ దాడులు : నలుగురి అరెస్టు



నిందితులతో ప్రత్తిపాడు సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 15 మద్యం సీసాలు, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం... ఒమ్మంగి గ్రామంలో 20 లీటర్ల సారాతో మొగిలి సత్యవతిని, ఆమెకు సారా అందించిన సత్తెనపల్లి శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరం గ్రామంలో బెల్ట్ షాపుపై దాడి చేసి పంపనబోయిన తాతాజీని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 180(ఎంఎల్) గల 15 డ్యూటీ పేయిడ్ లిక్కర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి మండలం తామరాడలో సారా బట్టీపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలం నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నుదునుమర్తి రాంబాబును అరెస్టు చేశారు. నిందితులపై బైండోవర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో కాకినాడ ఇంటిలిజెన్స్ వింగ్ సీఐ కె.గిరిధర్, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి. శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితర సిబ్బంది పాల్గొన్నారని సెబ్ సీఐ అశోక్ తెలిపారు.

ఐదు తరాల ఆత్మీయ కలయిక



వడ్లమూరులో ఒక్కచోట కలిసిన కంటే వారి కుటుంబ సభ్యులు

పెద్దాపురం: ఔను ఐదు తరాల వారంతా ఒకచోటకు చేరారు. సంక్రాంతికి ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఒకచోటు సందడి చేశారు. మండలంలోని వడ్లమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు కుటుంబ సభ్యులంతా బుధవారం వడ్లమూరులో ఆత్మీయంగా కలుసుకున్నారు. సుమారు 350 మంది సభ్యులుగా ఉన్న తాతలు, మామలు, అవ్వలు, ఆడపడుచులు, మనుమళ్లు, మునిమునమళ్లు, అల్లుళ్లు, తోడల్లుళ్లు అందరూ ఒకచోట చేరారు. ఈ ఆత్మీక కలయిక పండగ వాతావరణాన్ని మరింత ఉత్సాహాన్నిచ్చింది. కుటుంబ సభ్యులంతా కలసి పెద్దలను సత్కరించుకున్నారు.

బీచ్‌కు సందర్శకుల తాకిడి



కాకినాడ బీచ్‌లో సందర్శకుల సందడి

కాకినాడ రూరల్: సంక్రాంతి పండగకు వివిధ ప్రాంతాల నుంచి తమ సొంతూళ్లకు వచ్చిన వారు కాకినాడ బీచ్‌లో సరదాగా కాలక్షేపం కోసం తరలివస్తున్నారు. రెండు రోజులుగా బీచ్‌కు సందర్శకుల తాకిడి ఎక్కువ అయ్యింది. సూర్యారావుపేట వద్ద న్యూ, ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకుని సముద్ర స్నానాలు చేస్తూ సరదాగా గడుపుతున్నారు. మంగళవారం వేలాదిగా తరలి వచ్చిన సందర్శకులతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. బుధవారం కూడా ఎక్కువగా సందర్శకులు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో స్నానాలకు దిగేవారు సముద్రం లోపలకు వెళ్లకుండా మెరైన్ పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన

కరప: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 రూపకల్పనపై అందరూ అవగాహన కలిగించుకుని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్, గ్రామ పంచాయతీ ఫంక్షనల్ కమిటీ సభ్యులకు ఏర్పాటు చేసిన రెండురోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 17 రకాల సుస్థిరాభివృద్ధి సూచికలను సాధించేందుకు నిర్దేశించిన 9 థీమ్స్‌లో గ్రామ పంచాయతీకి అవసరమైన ఒక థీమ్‌ను ఎంపికచేసుకుని ఆయా అంశాలను పూర్తిచేసేందుకు సాధారణ నిధులు, 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి 25 శాతం కేటాయించి, మిగిలిన నిధులను ఇతర అంశాలకు వినియోగించాలన్నార. 15వ ఆర్థిక సంఘం నిధులు శానిటేషన్, తాగునీటి కోసం కేటాయించి, ఆన్‌లైన్ విధానంలో ప్రణాళికను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు, ఏఓ గుత్తుల భీమశంకర రాబు, వి.సునీల్‌కుమార్ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఎలా రూపొందించాలో వివరించి వీడియో ద్వారా శిక్షణ ఇచ్చారు.